

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



బుధవారం 04-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :137 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

జగన్‌పై కేసు నమోదు!



జగన్, అవినాష్ రెడ్డిపై కేసు నమోదు

పోలింగ్ రోజున ఆర్వో కార్యాలయం ఎదుట ధర్నా

ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కింద కేసులు

ఏజెంట్లను అడ్డుకున్నారంటూ వైసీపీ ఆరోపణలు

దొంగ ఓట్లు వేశారంటూ నేతల ఫిర్యాదు

రీపోలింగ్ కోరుతూ జగన్ నిరసన

ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించారన్న టీడీపీ

రాజకీయ కక్షసాధింపంటున్న వైసీపీ నేతలు 2 లో

మురసు బీభత్సం

భారీగా పంట నష్టం!

మురసు తుపానుతో భారీ పంట నష్టం

3 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతినడం

2 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం

ఆర్టీజీఎస్‌తో ముందస్తు వాతావరణ అంచనాలు

లోతట్టు ప్రాంతాల ప్రజలకు సురక్షిత పునరావాసం

విద్యుత్ పునరుద్ధరణలో సిబ్బంది సేవలకు ప్రశంసలు

గత తుపాను నష్టంపై కేంద్రానికి నివేదిక


2 లో

న్యూస్ డెస్క్, 03 నవంబర్ (ఇది కద నిజం): మురసు తుపాన్ ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ సమర్థవంతంగా పనిచేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. తుపాను ప్రభావం, సహాయక చర్యలపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకుని ముందస్తు చర్యలు చేపట్టడం వల్లే తుపాను నష్టాలను తగ్గించగలిగామని తెలిపారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఏ జిల్లాలు, ఏ గ్రామాల్లో భారీ వర్షాలు పడతాయో ముందే ఖచ్చితంగా అంచనా వేశామని సీఎం వెల్లడించారు.

నిరసనల పేరుతో ఆక్రమణలొద్దు!

ఢిల్లీలో ధర్నాలపై సుప్రీంకోర్టు విచారణ

కేంద్రానికి, వ్యాపార సంఘాలకు నోటీసులు

ఆందోళన నిర్వాహకులను ప్రతివాదులుగా చేర్చాలని ఆదేశం

నిరసన తెలిపే హక్కు అందరికీ సమానమే

నిరసనల పేరుతో ప్రాంతాలను నిరవధికంగా ఆక్రమించరాదు

పండుగల వేళ వ్యాపారులకు నష్టాలపై ఆందోళన

పౌరులు, వ్యాపారుల ప్రయోజనాలకూ ప్రాధాన్యం 2 లో

హక్కుల పరిరక్షణలో సమతుల్యత అవసరమన్న ధర్మాసనం

అంతరిక్షంలో చైనా రహస్య విమానం!

చైనా రహస్య అంతరిక్ష విమానం 'షెన్లాంగ్'

అమెరికా నిఘా నివేదికలో కీలక వివరాలు

అంతరిక్షంలో గుర్తుతెలియని వస్తువుల విడుదల

మ్యాక్సర్ ఉపగ్రహం తీసిన తాజా ఫోటోలు

మరో ఉపగ్రహానికి అనుసంధానమైన షెన్లాంగ్

పేలోడ్ తలుపు తెరిచి ఉన్నట్లు గుర్తింపు

నాలుగో మిషన్‌లో కొనసాగుతున్న అంతరిక్ష విమానం

26 అడుగుల పొడవు ఉంటుందని అంచనా



న్యూస్ డెస్క్, 03 నవంబర్ (ఇది కద నిజం): చైనా అత్యంత రహస్యమైన అంతరిక్ష విమానం "షెన్లాంగ్" కు చెందిన ఒక ఫోటో సంచలనంగా మారింది. అమెరికా నిఘా సంస్థ విడుదల చేసని రక్షణ ముప్పు అంచనా నివేదికలో దీని గురించి ఉంది. భూమి చుట్టూ కక్ష్యలో తిరుగుతున్న ఈ రోబోటిక్ అంతరిక్ష విమానం గతంలో అంతరిక్షంలో గుర్తుతెలియని వస్తువును విడుదల చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. గత ఆరేళ్లుగా ఇది అంతరిక్షంలో తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. లో ఎర్త్ ఆర్బిట్ లో గుర్తుతెలియని వస్తువులను విడుదల చేసినట్లు గతంలో పలు నివేదికలు వెల్లడించాయి. దీనిపై వార్తలు రావడంతో పలు సంస్థలు, వ్యక్తులు భూమిపై ఉన్న రాడార్లు, ఇతర సాంకేతిక పరికరాల సహాయంతో దీనిని ట్రాక్ చేస్తున్నారు. 2 లో

అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు

నేడు విచారణకు హాజరు!

అంబటి రాంబాబుకు ఈడీ తాజా నోటీసులు

మద్యం అక్రమ రవాణా కేసులో విచారణ

గతంలో అనారోగ్యంతో విచారణకు గైర్హాజరు

వైద్య నివేదికలను ఈడీకి పంపిన అంబటి

ఈ-మెయిల్ సమన్లు చూడలేదని వివరణ

మరోసారి అధికారికంగా నోటీసులు జారీ 2 లో

తుమ్మిడిహెట్టిపై రేవంత్ కీలక నిర్ణయం!

నిర్మాణ పనులపై అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష

మహారాష్ట్రతో చర్చలు వేగవంతం చేయాలని ఆదేశం

ముంపు భూములకు పూర్తి పరిహారం చెల్లిస్తామని హామీ


పరిహారం నిధులకు ప్రత్యేక జాయింట్ అకౌంట్

మహారాష్ట్ర స్వతంత్ర సర్వేకు అభ్యంతరం లేదన్న సీఎం

ఒప్పందాలు, పత్రాలు అందించాలని అధికారులకు సూచన

ముంపు వివరాలతో సిద్ధంగా ఉండాలని ఆదేశం 2 లో

భారత్-ఇజ్రాయెల్ బంధంపై పాక్ భయం!


2 లో

న్యూస్ డెస్క్, 03 నవంబర్ (ఇది కద నిజం): పాకిస్తాన్‌కు కొత్త భయాలు మొదలయ్యాయి. భారత్-ఇజ్రాయిల్ సంబంధాలపై పాకిస్తాన్ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ ఆందోళన వ్యక్తం చేసినట్లు ఇరాన్ భద్రతా అధికారి మొహ్సేన్ రెజాయీ వెల్లడించారు. హిందువులు, యూదుల మధ్య పెరుగుతున్న సంబంధాలు ముస్లింలకు, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా మారుతున్నాయని మునీర్ హెచ్చరించినట్లు ఆయన అన్నారు.

మున్సిపల్ ఫలితాలపై జగన్ ఆగ్రహం!



చంద్రబాబు, పోలీసులపై మాజీ సీఎం విమర్శలు

ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర అసంతృప్తి

నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు అక్రమాలంటూ ఆరోపణలు

వైసీపీ ఏజెంట్లను అడ్డుకున్నారంటూ మండిపాటు

పోలింగ్ రిగ్గింగ్ జరిగిందని జగన్ ఆరోపణ 2 లో

ఇవి ఎన్నికలు కాదు.. సెలెక్షన్లంటూ వ్యాఖ్య

సమగ్ర ఎన్నికల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్

వాటర్ షాక్ కాలేజీలకు లాక్!

న్యూస్ డెస్క్, 03 నవంబర్ (ఇది కద నిజం): హైదరాబాద్‌లో నీటి కొరత విద్యాసంస్థలకూ తాకింది. నగరంలో రానున్న నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు దీపావళికి ముందుగానే విద్యార్థులకు సెలవులు ప్రకటిస్తున్నాయి. ముఖ్యంగా మాదాపూర్, హైటెక్స్ ప్రాంతాల్లోని నారాయణ ఐఐటీ-జేఈఈ అకాడమీ క్యాంపస్‌లు తాత్కాలికంగా విద్యార్థులకు సెలవులు ఇవ్వాలని నిర్ణయించాయి. అయితే విద్యార్థుల చదువుకు అంతరాయం కలగకుండా ఆన్‌లైన్ తరగతులు కొనసాగిస్తామని స్పష్టం చేశాయి. శ్రీ చైతన్య విద్యాసంస్థల్లోనూ ముందస్తు సెలవుల నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు కూడా నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నాయి. మిగతాది 2 లో..

- హైదరాబాద్‌లో నీటి ఎద్దడి ఎఫెక్ట్
- దీపావళికి ముందే కాలేజీలకు సెలవులు
- నారాయణ, శ్రీ చైతన్య ముందస్తు నిర్ణయం
- ఆన్‌లైన్ క్లాసుల బాటలో విద్యాసంస్థలు
- యూనివర్సిటీలపై నీటి సంక్షోభం ప్రభావం
- ఓయూ,కేయూలో ప్రత్యామ్నాయ ఏర్పాట్ల పరిశీలన
- అవసరమైతే విద్యా సంవత్సరం కుదింపు
- ఇప్పటికే ఆన్‌లైన్‌లో బాసర RGUKT తరగతులు
- నీటి సరఫరాపైనే తదుపరి నిర్ణయాలు

ఏపీలో కూటమి ప్రభంజనం!

ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఆధిక్యం

600కు పైగా వార్డుల్లో టీడీపీ ముందంజ

జనసేన, బీజేపీ అభ్యర్థులకూ విజయాలు

పుంగనూరు, పెనుకొండ టీడీపీ ఖాతాలోకి

పుట్టపర్తి మున్సిపాలిటీని దక్కించుకున్న జనసేన

వినుకొండలో కూటమి అభ్యర్థుల విజయం

ఇచ్ఛాపురంలో టీడీపీ-జనసేన కైవసం

బద్వేల్ మున్సిపల్ పీఠం కూటమి సొంతం

జగ్గయ్యపేటలో మేఘనకు భారీ మెజారిటీ



న్యూస్ డెస్క్, 03 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో టీడీపీ-జనసేన-బీజేపీ అధికారిక కూటమి స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,020 వార్డులకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపులో కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో ముందంజలో కొనసాగుతున్నారు. ఇప్పటివరకు అందిన వివరాల ప్రకారం టీడీపీ 600కు పైగా వార్డుల్లో ఆధిక్యంలో ఉండగా, జనసేన 26, వైసీపీ 21, బీజేపీ 13 వార్డుల్లో ముందంజలో ఉన్నాయి. ఇక, మున్సిపాలిటీల్లోనూ కూటమి తన ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. 2 లో

ఆసియా కుబేరుల్లో అంబానీ టాప్!

ఒక్కరోజులో 8 బిలియన్ డాలర్ల సంపద పెరుగుదల

88.3 బిలియన్ డాలర్లకు చేరిన నికర ఆస్తులు

ఆసియాలో రెండో స్థానంలో జంగ్ యిమింగ్

మూడో స్థానంలో గౌతమ్ అదానీ

ప్రపంచ కుబేరుల్లో అగ్రస్థానంలో ఎలాన్ మస్క్

సంపద పెరుగుదలలో మస్క్, అంబానీ ముందంజ

లారీ ఎల్లిసన్‌కు భారీ ఆస్తి నష్టం



2 లో

న్యూస్ డెస్క్, 03 నవంబర్ (ఇది కద నిజం): ముకేశ్ అంబానీ మళ్లీ ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా తన అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత అయిన అంబానీ సంపద ఒక్కసారిగా 8 బిలియన్ డాలర్లు (దాదాపు 10.02 శాతం) పెరగడంతో ఆయన మొత్తం నికర ఆస్తి విలువ 88.3 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్ల జాబితా ప్రకారం ఈ వివరాలు వెల్లడయ్యాయి. జియో ప్లాట్‌ఫామ్స్ లిస్టింగ్ తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు భారీగా లాభపడ్డాయి.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 04-11-2026

నిరసనల పేరుతో ఆక్రమణలొద్దు!



న్యూస్ డెస్క్, 03 నవంబర్ (ఇది కద నిజం): దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలు, ఆందోళనలపై సుప్రీంకోర్టు మంగళవారం కీలక విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్నాల వల్ల ఎదురవుతున్న సమస్యలపై దాఖలైన పిటిషన్లపై స్పందించిన ధర్మాసనం.. కేంద్ర ప్రభుత్వంతో పాటు వ్యాపార సంఘాలకు నోటీసులు జారీ చేసింది. అలాగే, తమ పిటిషన్‌లో ఆందోళన నిర్వాహకులను కూడా ప్రతివాదులుగా చేర్చాలని వ్యాపార సంఘాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణ సమయంలో పౌరుల హక్కులు, వ్యాపారుల ఇబ్బందులపై సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది.

సమాజంలో అందరికీ హక్కు..

సమాజంలో నిరసన తెలియజేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఈ హక్కు ఏ ఒక్కరికో సొంతం కాదు అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సమస్యలపై గళమెత్తే హక్కు అందరిదీ అయినప్పటికీ, నిరసన తెలిపే ప్రాంతాలను నిరవధికంగా ఒక్కరే ఆక్రమించి ఉంచలేరు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇతరుల ఆవేదననూ గుర్తించాల్సిన అవసరం ఉందన్న కోర్టు, ముఖ్యంగా పండుగల వేళ ఇటువంటి సుదీర్ఘ ఆందోళనల వల్ల వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. హక్కుల పరిరక్షణతో పాటు సాధారణ పౌరులు, వ్యాపారుల ప్రయోజనాలను సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని ధర్మాసనం ఈ సందర్భంగా అభిప్రాయపడింది.

అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు

నేడు విచారణకు హాజరు!



న్యూస్ డెస్క్, 03 నవంబర్ (ఇది కద నిజం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. మద్యం అక్రమ రవాణా కేసుకు సంబంధించిన వ్యవహారంలో నేడు విచారణకు హాజరుకావాలని ఆదేశిస్తూ ఈ సమన్లు పంపారు. గతంలోనే ఈడీ అధికారులు విచారణకు రావాల్సిందిగా ఆయనకు నోటీసులు ఇచ్చినప్పటికీ, అనారోగ్య కారణాల వల్ల హాజరు కాలేకపోతున్నట్లు అంబటి రాంబాబు లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చారు.

ఆ తర్వాత తనకు గుండెకు స్టెంట్లు వేసినట్లు ఆసుపత్రి వైద్యులు ఇచ్చిన వైద్య నివేదికలను కూడా ఈడీ కార్యాలయానికి పంపించారు. ఈ నేపథ్యంలో గత నెల 29వ తేదీన ఈడీ అధికారులు ఈ నెల 4న విచారణకు రావాలని పేర్కొంటూ ఆయనకు అధికారికంగా ఈ-మెయిల్ ద్వారా సమన్లు పంపారు. అయితే.. ఆ మెయిల్‌ను తాను సమయానికి చూసుకోలేదని అంబటి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో నిన్న మరోసారి కొత్తగా నోటీసులు జారీ చేసిన ఈడీ బృందం, రేపు కచ్చితంగా విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. అధికారుల ఆదేశాల మేరకు నేడు ఆయన ఈడీ ఎదుట విచారణకు హాజరుకానున్నట్లు తెలుస్తోంది.

ఆసియా కుబేరుల్లో అంబానీ టాప్!

మొదటి పేజీ తరువాయి

2020 సంవత్సరం తర్వాత ఒకే రోజులో రిలయన్స్ షేర్లు సాధించిన అతిపెద్ద సింగిల్ డే గెయిన్ ఇదే కావడం విశేషం. ఈ అద్భుతమైన ర్యాలీతో అంబానీ ఒక్క రోజులోనే ప్రపంచంలోనే అత్యధికంగా సంపద పెంచుకున్న రెండో వ్యక్తిగా నిలిచారు.

ఇక, ప్రస్తుతం అంబానీ కంటే వెనుకబడిన బైట్‌డ్యాన్స్ వ్యవస్థాపకుడు జంగ్ యిమింగ్ 84 బిలియన్ డాలర్ల ఆస్తితో తదుపరి స్థానంలో ఉండగా, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ 79.1 బిలియన్ డాలర్ల సంపదతో ఆసియాలో మూడో స్థానంలో కొనసాగుతున్నారు. తాజా ర్యాంకింగ్స్ ప్రకారం జంగ్ యిమింగ్ కంటే అంబానీ 4.3 బిలియన్ డాలర్లు, అదానీ కంటే 9.2 బిలియన్ డాలర్ల ఆధిక్యంలో ఉన్నారు. మరోవైపు, ప్రపంచ స్థాయి బిలియనీర్ల విషయానికి వస్తే.. టెస్లా, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ఏకంగా 878.5 బిలియన్ డాలర్ల అంచనా ఆస్తితో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 366 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో నిలవగా, గూగుల్ లారీ పేజ్ 232.3 బిలియన్ డాలర్లతో మూడో స్థానంలో ఉన్నారు. డెల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు మైఖేల్ డెల్ 218.5 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో, గూగుల్ సెర్గీ బ్రిన్ 213.9 బిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో కొనసాగుతున్నారు.

అలాగే మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ 208.6 బిలియన్ డాలర్లతో ఆరో స్థానం, ఎన్విడియా అధినేత జెన్సన్ హువాంగ్ 175.3 బిలియన్ డాలర్లతో ఏడో స్థానం, ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ 159.7 బిలియన్ డాలర్ల సంపదతో ఎనిమిదో స్థానంలో నిలిచారు. ఒక్క రోజులోనే అత్యధిక సంపద పెంచుకున్న వారి జాబితాలో ఎలాన్ మస్క్ మొదటి స్థానంలో నిలిచారు. ఆయన సంపద 10 బిలియన్ డాలర్లు (1.15 శాతం) పెరిగింది. ఆ తర్వాత స్థానంలో ముకేశ్ అంబానీ 8 బిలియన్ డాలర్లు పెంచుకుని నిలవగా, జెఫ్ బెజోస్ 4.7 బిలియన్ డాలర్లు (1.29 శాతం) జోడించి మూడో స్థానంలో నిలిచారు. రోబ్ వాల్టన్, ఫ్యామిలీ, జిమ్ వాల్టన్, ఫ్యామిలీ కూడా చెరో 3.8 బిలియన్ డాలర్ల సంపదను పెంచుకుని ఈ జాబితాలో నిలిచారు. వీరి ఆస్తులు వరుసగా 2.58 శాతం మరియు 2.63 శాతం మేర పెరిగాయి.

ఒకవైపు అంబానీ సహా కొందరు బిలియనీర్లు లాభాల్లో దూసుకుపోతే, ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ తీవ్ర నష్టాన్ని చవిచూశారు. ఒక్క రోజులోనే ఆయన ఆస్తి 11.9 బిలియన్ డాలర్లు (6.91 శాతం) పడిపోవడంతో ఆ రోజు అత్యధికంగా సంపద కోల్పోయిన వారిలో మొదటి స్థానంలో నిలిచారు. మైఖేల్ డెల్ నికర ఆస్తి 9.9 బిలియన్ డాలర్లు (4.34 శాతం) తగ్గి రెండో అతిపెద్ద నష్టపోయిన వ్యక్తిగా మారారు. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ బాల్మర్ 3.7 బిలియన్ డాలర్లు (2.31 శాతం), చెన్ తియాన్‌షి 2.9 బిలియన్ డాలర్లు (12.15 శాతం) నష్టపోగా, మార్క్ జుకర్‌బర్గ్ సంపద 2.8 బిలియన్ డాలర్లు (1.32 శాతం) తగ్గింది. స్టాక్ మార్కెట్లలో వచ్చే హెచ్చుతగ్గులు బిలియనీర్ల ఆస్తులపై ఎంతటి తీవ్ర ప్రభావాన్ని చూపుతాయో ఈ తాజా మార్పులు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

అంతరిక్షంలో చైనా రహస్య విమానం!

మొదటి పేజీ తరువాయి

తాజాగా వెలువడిన ఫోటోలను 2024లో మ్యాక్సర్ టెక్నాలజీస్ శాటిలైట్ తీసింది. సుమారు 90 కిలోమీటర్ల దూరం నుంచి దీనిని ఫోటో తీసింది. అమెరికా డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ రూపొందించిన థ్రెట్ అసెస్మెంట్ నివేదికలో ఈ చిత్రం ఉంది. అంతరిక్షంలోకి వెళ్లిన వస్తువుల్ని కక్ష్యలో ప్రవేశపెట్టడం, వాటిపై ప్రయోగాలు నిర్వహించడం, తిరిగి భూమిని చేరుకునే సామర్థ్యాలు ఈ అంతరిక్ష విమానానికి ఉన్నాయని నివేదిక పేర్కొంది.

అంతరిక్షంలో మరో ఉపగ్రహానికి ఈ విమానం అనుసంధానమై ఉన్నట్లు ఫోటోలో కనిపిస్తోంది. దీని సోలార్ ప్యానెల్స్ విస్తరించి ఉన్నాయి. విమానం వెనక భాగంలో పేలోడ్ తలుపు కూడా తెరిచి ఉన్నట్లు ఫోటోలో కనిపిస్తోంది. షెన్‌లాంగ్ రపునర్వినియోగించగల అంతరిక్ష విమానం. ఇది అమెరికాకు చెందిన బోయింగ్ నిర్మిత X-37B అంతరిక్ష విమానాన్ని పోలి ఉంటుంది. రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపిన తర్వాత కక్ష్యలోకి చేరుకుని విమానంలా మళ్లీ భూమిపై ల్యాండ్ అవుతుంది.

ప్రస్తుతం ఇది నాలుగో మిషన్ కోసం అంతరిక్షంలో ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి 7న చైనాలోని జియుక్వాన్ శాటిలైట్ సెంటర్ నుంచి లాంగ్ మార్చ్ -2 ఎఫ్ రాకెట్ ద్వారా దీన్ని ప్రయోగించారు. షెన్‌లాంగ్‌కు సంబంధించి ఇప్పటి వరకు చైనా ఎలాంటి ఫోటో విడుదల చేయలేదు. అయితే, ప్రస్తుతం ఫోటోను బట్టి ఈ అంతరిక్ష విమానం పొడవు సుమారు 26 అడుగులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

జగన్‌పై కేసు నమోదు!

న్యూస్ డెస్క్, 03 నవంబర్ (ఇది కద నిజం): పులివెందుల స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ రోజున రిటర్నింగ్ అధికారి కార్యాలయం ముందు వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ధర్నా చేపట్టడంతో పులివెందుల పోలీసులు వారిపై ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కింద కేసులు నమోదు చేశారు. ఈ ఘటన ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద దుమారాన్ని రేపుతోంది. వైఎస్సార్సీపీ వర్గాల ప్రకారం.. పులివెందుల పరిధిలోని పలు పోలింగ్ బూతుల్లో తమ పార్టీ ఏజెంట్లను లోపలికి రానివ్వకుండా అధికార టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయని, దొంగ ఓట్లు వేస్తూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, బూత్ క్యాప్చరింగ్ జరిగిన ప్రాంతాల్లో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జగన్ స్వయంగా రోడ్డుపైకి వచ్చి ఆర్వో ఆఫీసు ముందు నిరసనకు దిగారు. మరోవైపు.. అధికార కూటమి, టీడీపీ నాయకులు ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఓటమి తథ్యమని గ్రహించే జగన్, అవినాష్ రెడ్డిలు పోలింగ్ రోజున నాటకాలు ఆడుతూ ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించారని విమర్శించారు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉన్నప్పుడు ధర్నాలు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఈ పరిణామంతో పులివెందులలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. వైఎస్సార్సీపీ ఈ కేసులను రాజకీయ కక్షసాధింపు చర్యగా అభివర్ణిస్తూ న్యాయపోరాటానికి సిద్ధమవుతుండగా, ప్రభుత్వం శాంతిభద్రతల ఉల్లంఘనగానే దీనిని పరిగణిస్తోంది. జగన్‌పై కేసు నమోదు చేయడం అనేది పులివెందులలో వైఎస్ కుటుంబానికి ఉన్న రాజకీయ పట్టును దెబ్బతీయడానికి కూటమి ప్రభుత్వం వేస్తున్న వ్యూహాత్మక అడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

మురసు బీభత్సం.. భారీగా పంట నష్టం!

మొదటి పేజీ తరువాయి

లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాల్లో ఏ ఇబ్బంది కలగకుండా చూసుకున్నామని తెలిపారు. చెరువు కట్టలు తెగిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా చూడగలిగామని అన్నారు.

విద్యుత్ పునరుద్ధరణలో సిబ్బంది అద్భుత సేవలు

గతంలో వచ్చిన 'అర్నబ్' తుపాను కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా చిన్నాభిన్నమైందని సీఎం గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 580 సబ్ స్టేషన్లలో ఇబ్బందులు రాగా, 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, 4 వేల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. అయితే విద్యుత్ సిబ్బంది, అధికారులు తమ ప్రాణాలకు తెగించి రాత్రింబవళ్లు శ్రమించి కేవలం నాలుగైదు రోజుల్లోనే విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించారని అభినందించారు.

నష్ట పరిహారం అంచనా.. కేంద్రానికి నివేదిక

'అర్నబ్' తుపాన్ వల్ల రాష్ట్రానికి మొత్తం రూ. 4,526 కోట్ల నష్టం వాటిల్లిందని, కేంద్ర బృందాల ద్వారా నష్టాన్ని అంచనా వేయించి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపామని తెలిపారు. అలాగే ప్రస్తుతం సంభవించిన 'మురసు' తుపాను వల్ల కలిగిన నష్టాన్ని కూడా త్వరగా అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. మురసు ప్రభావంతో ప్రాథమికంగా 3 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 22 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.

ఏపీలో కూటమి ప్రభంజనం!

మొదటి పేజీ తరువాయి

పుంగనూరు, పెనుకొండ మున్సిపాలిటీలను టీడీపీ సొంతం చేసుకుంది. పుట్టపర్తి మున్సిపాలిటీని జనసేన కైవసం చేసుకోగా, ఆ పార్టీ అభ్యర్థి ఎం. ఈశ్వర్ మున్సిపల్ చైర్మన్‌గా విజయం సాధించారు. పిఠాపురంలోనూ జనసేన అభ్యర్థులు మంచి ఆధిక్యంతో ముందుకు సాగుతున్నారు. ప్రధాన నగరాలైన గ్రేటర్ విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప, అనంతపురం కార్పొరేషన్లలోనూ కూటమి అభ్యర్థుల హవా కొనసాగుతోంది. ముఖ్యంగా తూర్పుగోదావరి జిల్లాలోని 96 వార్డుల్లో కూటమి అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శిస్తున్నారు. మండపేటలో కూటమి 36 వార్డులను, కొవ్వూరులో 27 వార్డులను కైవసం చేసుకుంది.

వినుకొండ మున్సిపాలిటీలోనూ కూటమి విజయం సాధించింది. ఇక్కడ టీడీపీ 14, బీజేపీ 2, జనసేన ఒక స్థానంలో గెలుపొందగా, వైసీపీ ఒక వార్డును దక్కించుకుంది. శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో మొత్తం 27 వార్డుల కౌంటింగ్ పూర్తయింది. ఇందులో టీడీపీ 15, జనసేన 4 స్థానాలు గెలుచుకుని మున్సిపాలిటీని కైవసం చేసుకున్నాయి. వైసీపీ 7 స్థానాల్లో విజయం సాధించగా, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. మరోవైపు.. వైఎస్ఆర్ కడప జిల్లాలోని బద్వేల్ మున్సిపల్ పీఠాన్ని కూడా అధికారిక కూటమి కైవసం చేసుకుంది. మరోవైపు జగ్గయ్యపేటలో జనసేన అభ్యర్థి మేఘన ప్రత్యేక విజయాన్ని నమోదు చేశారు. 31వ వార్డులో పోటీ చేసిన ఆమె 540 ఓట్ల భారీ ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. వాసిరెడ్డి పద్మ కుమార్తె అయిన మేఘన గెలుపు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో కూటమి పార్టీలు మెజారిటీ ప్రాంతాల్లో విజయాలు నమోదు చేస్తుండటంతో టీడీపీ-జనసేన-బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

భారత్-ఇజ్రాయెల్ బంధంపై పాక్ భయం!

మొదటి పేజీ తరువాయి

అక్టోబర్ 26న ఇరాన్ రాజధాని టెహ్రాన్ వేదికగా జరిగిన నాలుగు దేశాల భద్రతా సమావేశంలో మునీర్ ఈ వ్యాఖ్యలు చేశారని రెజాయీ వెల్లడించినట్లు పాకిస్తాన్ మీడియా వెల్లడించింది.

టెహ్రాన్ వేదికగా 4 ముస్లిం దేశాల సమావేశం..

ఇజ్రాయిల్, అమెరికాతో ప్రాంతీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో అక్టోబర్ 26న టెహ్రాన్‌లో ఇరాన్, పాకిస్తాన్, సౌదీ అరేబియా, టర్కీ ప్రతినిధులు సమావేశమయ్యారు. పాకిస్తాన్ తరుఫున అసిమ్ మునీర్, టర్కీ తరఫున ఇంటెలిజెన్స్ చీఫ్ ఇబ్రహీం కలిన్ హాజరయ్యారు. సౌదీ అరేబియా తరఫున రక్షణ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్, ఇరాన్ తరఫున భద్రతా అధికారి మొహ్సేన్ రెజాయీ పాల్గొన్నారు.

అక్టోబర్ 31న ఇరాన్ ప్రభుత్వ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రెజాయీ ఈ సమావేశం గురించి మాట్లాడారు. పాకిస్తాన్, టర్కీ, సౌదీలు ఇజ్రాయిల్ నుంచి ఎదురవుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేశాయి. "ముస్లింలకు, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా హిందువులు-యూదుల మధ్య ఏర్పడుతున్న సంబంధాల గురించి అసిమ్ మునీర్ మాట్లాడారు" అని రెజాయీ చెప్పారు.

పాకిస్థానీ జర్నలిస్ట్ నజామ్ సేథీ కూడా రెజాయీ వెల్లడించిన విషయాలపై తన యూట్యూబ్ కార్యక్రమంలో చర్చించారు. హిందువులు, యూదుల మధ్య కూటమి తమకు పెద్ద ముప్పుగా మారుతుందని మునీర్ హెచ్చరించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇండియా-ఇజ్రాయిల్ బంధం బలోపేతం..

భారత్-ఇజ్రాయిల్ మధ్య దశాబ్దాలుగా సైనిక, రక్షణ, టెక్ భాగస్వామ్యం కొనసాగుతోంది. వ్యవసాయం, నీటి నిర్వహణలో ఇజ్రాయిల్ భారత్‌కు సహకరిస్తోంది. 2026 ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా ఇరు దేశాలు తమ సంబంధాలను ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకెళ్లాయి. 2025 మేలో పాకిస్తాన్‌పై భారత్ జరిపిన "ఆపరేషన్ సిందూర్" దాడులకు ఇజ్రాయిల్ బహిరంగంగా మద్దతు తెలిపింది.

2026 ఫిబ్రవరిలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భారత్, ఇజ్రాయెల్, గ్రీస్, సైప్రస్ తదితర దేశాలతో కూడిన 'హెక్సాగన్ ఆఫ్ అలయెన్సెస్' ప్రతిపాదనను ప్రస్తావించారు. రాడికల్ షియా, సున్నీ కూటములను ఎదుర్కొనేందుకు ఈ భాగస్వామ్యాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

మునీర్ భారత-హిందూ వ్యతిరేకత..

పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ బహిరంగంగానే భారత్, హిందూ వ్యతిరేకతను కనబరుస్తున్నారు. పలు సందర్భాల్లో హిందువుల గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హిందువులు, ముస్లింలు మతం, ఆచారాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, లక్ష్యాల పరంగా భిన్నమైన సమూహాలని మునీర్ గతంలో పలుమార్లు వ్యాఖ్యానించారు. 2025 ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రదాడికి కొద్ది రోజుల ముందు కూడా ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. జమ్మూ కాశ్మీర్ పాకిస్తాన్ జీవనాడిగా అభివర్ణించిన కొన్ని రోజులకే పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగింది.

తుమ్మిడిహెట్టిపై రేవంత్ కీలక నిర్ణయం!



న్యూస్ డెస్క్, 03 నవంబర్ (ఇది కద నిజం): తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును మరింత వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఇరిగేషన్ శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన ప్రతి అంశాన్ని సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను స్పష్టంగా ఆదేశించారు. మహారాష్ట్రతో ఇటీవల జరిగిన చర్చల పురోగతిని సమీక్షించిన సీఎం, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

ముంపు భూములకు తగిన పరిహారం.. జాయింట్ అకౌంట్‌లో నిధులు

బ్యారేజ్ నిర్మాణం వల్ల మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ముంపునకు గురయ్యే భూములకు పూర్తిస్థాయిలో తగిన పరిహారం చెల్లించడానికి తెలంగాణ ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. దీనికోసం ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా, అవసరమైన నిధులను ప్రత్యేకంగా 'జాయింట్ అకౌంట్'లో ఉంచుతామని స్పష్టం చేశారు. అంతేకాకుండా, ముంపు ప్రాంతాలు , భూముల వివరాలపై మహారాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి స్వతంత్ర సర్వే చేయించుకున్నప్పటికీ తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన తేల్చిచెప్పారు. మహారాష్ట్ర అధికారులకు కావాల్సిన సమస్త సమాచారాన్ని, ఇప్పటివరకు కుదిరిన ఒప్పందాలు , ఇతర పత్రాలను ఎప్పటికప్పుడు వారికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. ముంపునకు సంబంధించిన పూర్తి సమగ్ర వివరాలతో ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు.

మున్సిపల్ ఫలితాలపై జగన్ ఆగ్రహం!

న్యూస్ డెస్క్, 03 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ, వెలువడుతున్న ఫలితాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఏపీ సీఎం చంద్రబాబు, పోలీసు యంత్రాంగం, రాష్ట్ర ఎన్నికల సంఘం లక్ష్యంగా ఆయన ట్విట్టర్ వేదికగా ఓ ఘాటైన పోస్ట్ చేశారు. విపక్షాలకు కనీసం పోటీ చేసే అవకాశం కూడా లేకుండా చేసి ఎన్నికల్లో ఏకపక్షంగా ఎలా గెలవాలో సీఎం చంద్రబాబు, పోలీసులు, ఎస్ఈసీ బృందం నిరూపించారంటూ జగన్ తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఈ ఎన్నికల ప్రక్రియలోని ప్రతి దశలోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని జగన్ ఆరోపించారు. నామినేషన్ల వేయడం నుంచి వాటి పరిశీలన, ఉపసంహరణ వరకు అన్నింటినీ హైజాక్ చేశారని విమర్శించారు. పోలింగ్ రోజున వైఎస్సార్సీపీ పోలింగ్ ఏజెంట్లను తీవ్రంగా అడ్డుకోవడమే కాకుండా, కేంద్రాల నుంచి బయటకు లాగేశారని పేర్కొన్నారు. అలాగే పోలింగ్‌లో ప్రత్యక్ష రిగ్గింగ్‌కు పాల్పడి, పోలింగ్ శాతాన్ని తమకు అనుకూలంగా మేనేజ్ చేసి తారుమారు చేశారని, చివరికి ఓట్ల లెక్కింపును కూడా పూర్తిగా హైజాక్ చేశారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగలేదని, ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోలేదని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ప్రభుత్వమే తమకు కావలసిన అభ్యర్థులను ముందే ఎంపిక చేసుకుందని, ఇవి అసలు 'ఎలక్షన్స్' కావని, కేవలం 'సెలెక్షన్స్' మాత్రమేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండాలంటే సమగ్రమైన ఎన్నికల సంస్కరణలు తీసుకురావాల్సిన అత్యవసర తీవ్రత ఏర్పడిందని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు.

వాటర్ షాక్.. కాలేజీలకు లాక్!

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్‌లో నీటి సంక్షోభం తీవ్రతరం కావచ్చనే అంచనాలతో నారాయణ ఐఐటీ-జేఈఈ అకాడమీ ముందస్తు చర్యలు చేపట్టింది. మంగళవారం న విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం.. మాదాపూర్ హాస్టల్ క్యాంపస్‌లో జూనియర్, సీనియర్ విద్యార్థులకు దీపావళి వరకు తాత్కాలిక సెలవులు ఇవ్వాలని నిర్ణయించింది. హైటెక్స్-1 డివిజన్‌కు సంబంధించిన మరో సర్క్యులర్‌లోనూ ఇదే విషయాన్ని వెల్లడించింది. విద్యార్థులు క్యాంపస్‌లో లేకపోయినా చదువుకు ఆటంకం కలగకుండా ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తామని యాజమాన్యం తెలిపింది.

దీపావళి వరకు తరగతులు క్రమం తప్పకుండా కొనసాగుతాయని.. విద్యార్థులంతా తప్పనిసరిగా ఆన్‌లైన్ క్లాసులకు హాజరు కావాలని యాజమాన్యం సూచించింది. క్యాంపస్‌ను తిరిగి ఎప్పుడు ప్రారంభించాలనే విషయాన్ని దీపావళికి ముందే తెలియజేస్తామని పేర్కొంది. విద్యార్థులు హాస్టళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు మంగళవారం సాయంత్రం నుంచి అనుమతి ఇచ్చినట్లు సర్క్యులర్లలో వివరించారు. మాదాపూర్ క్యాంపస్ సర్క్యులర్‌లో సాయంత్రం 5 గంటల నుంచి.. హైటెక్స్-1 సర్క్యులర్‌లో సాయంత్రం 6.30 గంటల నుంచి అవుటింగ్‌కు అనుమతి ఉంటుందని వేర్వేరుగా పేర్కొన్నారు.

నీటి కొరత నేపథ్యంలో శ్రీ చైతన్య విద్యాసంస్థలు కూడా కొన్ని క్యాంపస్‌లలో దీపావళికి ముందుగానే సెలవులు ప్రకటించినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ తరగతుల ద్వారా విద్యార్థుల అకడమిక్ కార్యకలాపాలను కొనసాగించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఏయే బ్రాంచ్‌లకు ఈ నిర్ణయం వర్తిస్తుందనే పూర్తి వివరాలు వెల్లడించలేదు.

నీటి కొరత సమస్య ప్రైవేట్ కాలేజీలకే పరిమితం కాలేదు. రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లపైనా దీని ప్రభావం పడే అవకాశం ఉండటంతో తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) అలర్ట్ అయింది. వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతో సమావేశమై పరిస్థితిని సమీక్షిస్తోంది. నీటి ఎద్దడి కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మండలి భావిస్తోంది. అవసరమైతే విద్యా సంవత్సరాన్ని కుదించడం, ఆన్‌లైన్ తరగతులకు మారడం వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు టీజీసీహెచ్ఈ చైర్మన్ వి. బాలకిష్టారెడ్డి వెల్లడించారు. అయితే రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు ఆన్‌లైన్ తరగతులు తప్పనిసరి చేస్తూ ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదని స్పష్టమవుతోంది.

హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 10 వేల మందికి పైగా విద్యార్థులు హాస్టళ్లలో ఉంటున్నారు. వర్సిటీ సిబ్బంది, అధ్యాపకులు కూడా క్యాంపస్‌లోనే ఉండటంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. జేఎన్‌టీయూ హైదరాబాద్ ప్రధాన క్యాంపస్, అనుబంధ కాలేజీల్లో కలిపి సుమారు 8 వేల నుంచి 10 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో దాదాపు 6 వేల మంది విద్యార్థులు ఉండగా, వీరిల

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 04-11-2026

బెల్టు షాపులపై అబ్కారీ శాఖ ఏం చేస్తోంది?

అధికారులను నిలదీసిన టంగుటూరు సర్పంచ్ జూకంటి అనిల్ కుమార్



ఇది కద నిజం ,ఆలేరు: మండలంలోని గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణ విచ్చలవిడిగా సాగుతున్నా అబ్కారీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని టంగుటూరు సర్పంచ్ జూకంటి అనిల్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరును ప్రశ్నించారు. పాఠశాలలు, ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో మద్యం సేవించి ఖాళీ సీసాలు పడేస్తుండటంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అవసరమైతే మరో రెండు మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వండి కానీ, గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యాదగిరిగుట్టలో లాడ్జీలపై పోలీసుల ఆకస్మిక దాడులు!

సరైన రికార్డులు నిర్వహించని లాడ్జి యజమానులపై కేసులు నమోదు చేస్తాం: టౌన్ సీఐ భాస్కర్





ఇది కద నిజం ,యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని పలు లాడ్జిలపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిల్లో బస చేస్తున్న వారి వివరాలు, గదుల కేటాయింపులకు సంబంధించిన రికార్డులను పోలీసులు పరిశీలించారు. లాడ్జిలకు వచ్చే వ్యక్తుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. లాడ్జిల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ సరైన రికార్డులు నిర్వహించని యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని యాదగిరిగుట్ట టౌన్ సీఐ భాస్కర్ స్పష్టం చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టకు నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పోలీసుల నిఘా కొనసాగుతుందని తెలుస్తోంది. లాడ్జి యజమానులు పోలీసుల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, తనిఖీలకు సహకరించాలని పోలీసులు సూచించారు. లాడ్జిల నిర్వహణపై పోలీసుల ప్రత్యేక నిఘా కొనసాగుతుండటంతో లాడ్జి యజమానుల్లో అప్రమత్తత నెలకొంది.

జఫర్‌గఢ్‌లో ఘనంగా కలెక్టర్ కప్ క్రీడా పోటీలు

● మండల స్థాయిలో 160 మంది విద్యార్థుల ప్రతిభాప్రదర్శన.. జిల్లా స్థాయికి 40 మంది ఎంపిక

ఇది కద నిజం న్యూస్
జఫర్‌గఢ్, నవంబర్ 3



జఫర్‌గఢ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి కలెక్టర్ కప్ క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని 10 ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 160 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు.అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా చెస్, క్యారమ్స్, యోగాసనాలు, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ప్రతి క్రీడలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విజేతల్లో మొత్తం 40 మంది విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి మంగు జయప్రకాశ్ తెలిపారు.ఈ పోటీలన్నీ వ్యక్తిగత విభాగాల్లో నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన క్రీడా కమిటీల సభ్యులను, ప్రతిభ కనబరిచిన విజేత విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు ఆకుల సాయిలు, భూక్యా వంశీకృష్ణ, హరిత, శిరం శెట్టి శ్రీధర్, తాళ్లపల్లి మహాలక్ష్మి, రాజు, శ్రీనాథ్, రోజా కుమారి, శ్రీలత, చందా సాంబరాజు, ఉపాధ్యాయులు పిట్టల మహేందర్, నక్క కుమార్, వేణుగోపాల్, శ్రవణ్ కుమార్, మాల్యా, ఆకుల సృజన, సీఆర్పీలు పుట్టా స్వామి, మామిడాల శివకృష్ణ, బక్కం రాజ్ కుమార్, అంకేశ్వరపు హరిప్రసాద్, కుసుమ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కురవి మండలంలో ఆర్టీఏ కొరడా

బడి పిల్లల వాహనాలపై ప్రత్యేక తనిఖీలు! ఓవర్‌లోడ్ ఆటోలు సీజ్.. సరైన పత్రాలు లేని వాహనాలపై చర్యలు

ఇది కద నిజం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.



మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా బడి పిల్లలను తరలించే ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాలు, పాఠశాల బస్సులపై రవాణా శాఖ అధికారులు వరుసగా రెండో రోజు తనిఖీలు కొనసాగిస్తున్నారు. కురవి మండల కేంద్రంలో వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) శంకర్ నాయక్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకుంటున్నారు.

ఓవర్‌లోడ్ వాహనాలు సీజ్

విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించుకొని వెళ్తున్న ఆటోలతో పాటు సరైన పత్రాలు లేని వాహనాలపై అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆర్‌సీ, ఎఫ్‌సీ, పర్మిట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి అవసరమైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తున్నారు. పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా వాహన యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు.

తల్లిదండ్రులకు విజ్ఞప్తి

తల్లిదండ్రులు తమ పిల్లలను ఓవర్‌లోడ్ ఆటోలు,టాటా మ్యాజిక్ వాహనాల్లో పాఠశాలలకు పంపించవద్దు.వాహనంలో పరిమితికి మించి పిల్లలను ఎక్కిస్తున్నారా? డ్రైవర్‌కు సరైన డ్రైవింగ్ లైసెన్స్ ఉందా? వాహనానికి అవసరమైన పత్రాలు ఉన్నాయా? అనే విషయాలను పరిశీలించాలి. పిల్లలను సురక్షితంగా పాఠశాలకు పంపించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని తెలిపారు.

పాఠశాలల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలి

పాఠశాలలకు విద్యార్థులను తీసుకువచ్చే ఆటోలు, టాటా మ్యాజిక్ వాహనాలు, ఇతర రవాణా వాహనాలకు అవసరమైన అన్ని పత్రాలు ఉన్నాయో లేదో యాజమాన్యాలు తప్పనిసరిగా తనిఖీ చేయాలి. డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉందో లేదో నిర్ధారించుకోవాలి అన్నారు,నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాహనాలకే విద్యార్థులను తరలించే బాధ్యత అప్పగించాలి. విద్యార్థుల భద్రతను విస్మరించవద్దని సూచించారు.

వర్షాకాలంలో మరింత అప్రమత్తత అవసరం

వర్షాల సమయంలో కరకట్టలు, చెరువు కట్టలు,బురద రహదారులు,జారుడు మార్గాల్లో వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలి. వర్షం కారణంగా టైర్లు జారిపోయే ప్రమాదం ఉంది. వాహనం అదుపు తప్పడం, బ్రేకులు సరిగా పనిచేయకపోవడం వంటి పరిస్థితులు ఎదురుకావచ్చు అన్నారు,ముఖ్యంగా బడి పిల్లలను తీసుకెళ్లే వాహనాల డ్రైవర్లు వేగాన్ని తగ్గించి, రహదారి పరిస్థితులను గమనిస్తూ ప్రయాణశీ చెయ్యాలి అన్నారు.

ఈ ప్రత్యేక తనిఖీల కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు ఎస్. వెంకట్ రెడ్డి, ఖాసీం, సుందర్‌లాల్ పాల్గొని వాహనాలను తనిఖీ చేస్తూ నిబంధనలపై అవగాహన కల్పించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

ఇది కద నిజం న్యూస్
పర్వతగిరి/నవంబర్ 3



పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన కొలుగురి వీరయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వీరయ్య భౌతికకాయంపై పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వీరయ్య మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ మంత్రితో పాటు మండల సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరిలో పట్టభద్రుల ఓటరు నమోదుపై సమీక్ష

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దిశానిర్దేశం

ఇది కద నిజం న్యూస్ పర్వతగిరి/నవంబర్ 3



రానున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో పర్వతగిరి మండల కేంద్రంలోని తన నివాసంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు భారత రాష్ట్ర సమితి ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టభద్రుల శాసనమండలి ఓటరు నమోదు కార్యక్రమం పురోగతిపై నాయకులతో సమీక్షించి,అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు అయ్యేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గతంలో కరోనా సమయంలోనూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు నీరు, విద్యుత్ సహా అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులెత్తేశారని విమర్శించారు.”నా వల్ల కాదు అంటున్న ముఖ్యమంత్రి ఎందుకు ఆ కుర్చీలో ఉన్నావ్? దేవాదుల ప్రాజెక్టులో పంపులు ఎందుకు ఆన్ చేయలేదు? అధికారులను అడిగితే కనీసం మోటార్లు రిపేర్ చేసేందుకు కూడా డబ్బులు లేవని మొరపెట్టుకుంటున్నారు. కరెంట్ కోతల పాపం నీదే. కరోనా సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ఆదుకున్న ఘనత కేసీఆర్ ది. పాపాత్ముడు ఎనిమిది నెలలు కష్టమే అని చేతులెత్తేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. ఇదంతా రేవంత్ రెడ్డి చేసిన పాపమే. ఇప్పటికైనా కళ్లు తెరవండి. చంద్రబాబు నీలాగా చేతులెత్తేశాడా? ఒకప్పుడు చంద్రబాబు నాయుడు తెలంగాణలో భూముల రేట్లు అధికంగా ఉన్నాయన్నారు,కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో భూముల ధరలు పెరుగుతున్నాయి,తెలంగాణలో పడిపోతున్నాయి. దీనికి కారణం ఈ మూర్ఖపు రేవంత్ రెడ్డే”అని ధ్వజమెత్తారు.పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రుల భాగస్వామ్యం పెరిగేలా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా కృషి చేయాలని కోరారు.

ఈ సమావేశంలో మండల భారత రాష్ట్ర సమితి పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు పొడిగింపుపై భాస్కర్ని వీరంరాజు హర్షం”

సాంకేతిక సమస్యల పరిష్కారానికి, ఓటరు నమోదు గడువు పొడిగింపునకు స్పందించిన ఎన్నికల సంఘానికి కృతజ్ఞతలు”



ఖమ్మం,నవంబర్03(ఇది కద నిజం) న్యూస్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువును నవంబర్ నెలాఖరు వరకు పొడిగిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ప్రకటించడం పట్ల బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షురాలు, న్యాయవాది భాస్కర్ని వీరంరాజు హర్షం వ్యక్తం చేశారు.గత కొన్ని రోజులుగా అధికారిక వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యల కారణంగా అర్హులైన అనేక మంది పట్టభద్రులు ఆన్‌లైన్‌లో ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోలేకపోయారని ఆమె పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించి, గడువు పొడిగించాలని తాను ఎన్నికల అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించి గడువు పొడిగించడం వల్ల అర్హులైన పట్టభద్రులకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం లభించిందని, అలాగే, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినవారు మళ్లీ ప్రింట్ తీసి గెజిటెడ్ అధికారి సంతకంతో సమర్పించాలనే విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు.అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

స్టేషన్ ఘనపూర్,ఇది కద నిజం, నవంబర్ 03:



స్టేషన్ ఘనపూర్ పట్టణానికి చెందిన కుంభం రాజయ్య ముదిరాజ్ ఇటీవల రెండు కిడ్నీలు పనిచేయక అనారోగ్యంతో మృతి చెందడంతో నిరుపేద కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. కడు పేదరికంలో జీవిస్తున్న ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి సారయ్య, పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పెసరు రాజన్న దృష్టికి తీసుకెళ్లారు. ముదిరాజ్ దాతల సహకారంతో బాధిత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు సింగారపు రామకృష్ణ, పెసరు సారయ్య తదితరులు మృతుని స్వగృహానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం స్థానిక కుల పెద్దలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు సింగారపు రామకృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు వేరైనా, ఆపద సమయంలో కుల బంధువులంతా ఒక్కటై బాధిత కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని అన్నారు. స్టేషన్ ఘనపూర్ ముదిరాజుల ఐక్యత, మానవత్వానికి ఈ సహాయ కార్యక్రమం నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణలోని ప్రతి గ్రామంలోని ముదిరాజ్ కుల పెద్దలు ఇలాంటి ఐక్యతను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. యువత విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు, తమ స్థాయికి తగిన విధంగా పేదలకు, ఆపదలో ఉన్న వారికి సహాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు.స్థానిక కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి సారయ్య మాట్లాడుతూ సిద్దిపేటలో ఉన్న పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పెసరు రాజన్నకు కుంభం రాజయ్య కుటుంబ పరిస్థితిని తెలియజేయగానే వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు రావడం ఎంతో గొప్ప విషయమని అన్నారు.ఈ సహాయానికి సహకరించిన పెసరు రాజన్నతో పాటు దాతలందరికీ గ్రామ ముదిరాజ్ కుల బంధువుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో

పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు సింగారపు రామకృష్ణ, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్ ముదిరాజ్, స్థానిక కౌన్సిలర్లు పొన్నం స్వరూప, పెసరు కృష్ణవేణి సారయ్య, రాజయ్య ముదిరాజ్, సేవకులు దండు చిరంజీవి ముదిరాజ్, స్థానిక పట్టణ కుల పెద్దలు కుంభం గణేష్, సాంబరాజు, రాము, కుమారస్వామి, రవి, రాము, సుధాకర్, కుంభం మధు, కుంభం రామస్వామి శంకర్, వై. రాజు, బాబు తదితరులతో పాటు కీర్తిశేషులు రాజయ్య సతీమణి వినోద, ముగ్గురు కుమార్తెలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 04-11-2026

సినిమా న్యూస్

నలుగురు ఫ్రెండ్స్ ఫుల్ సందడి!



టాలీవుడ్ యువత ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'ఈ నగరానికి ఏమైంది 2' ఒకటి. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా, తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా 2018లో విడుదలై ప్రేక్షకులను అలరించిన 'ఈ నగరానికి ఏమైంది' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతోంది. మొదటి భాగానికి యువతలో ఉన్న క్రేజ్‌తో ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు ఆసక్తిని పెంచగా.. ఇప్పుడు ట్రైలర్ కూడా సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.

ట్రైలర్‌ను పరిశీలిస్తే.. మరోసారి నలుగురు స్నేహితుల జీవితాల్లో చోటుచేసుకునే సంఘటనలే కథకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు కనిపిస్తోంది. ఈసారి వాళ్లంతా కలిసి ఓ సినిమా చేయాలని ప్లాన్ చేసుకోవడం, ఆ ప్రయత్నంలో ఎదురయ్యే సమస్యలు, కొత్త వ్యక్తుల పరిచయాలు, అనుకోని పరిణామాలు కథలో ఆసక్తిని పెంచుతున్నాయి. వీటికి తోడు స్నేహితుల మధ్యే తలెత్తే గొడవలు, సరదా సన్నివేశాలు ప్రేక్షకులను నవ్వించేలా ఉన్నాయి. మొదటి భాగంలో కనిపించిన స్నేహం, కామెడీ, యువత జీవితానికి దగ్గరగా ఉండే సంఘటనలను ఈసారి మరింత విస్తృతంగా చూపించినట్లు ట్రైలర్‌ను బట్టి అర్థమవుతోంది. ముఖ్యంగా కథలోని పరిస్థితులు, పాత్రల మధ్య సంబంధాలు మరింత లోతుగా ఉండబోతున్నాయనే భావన కలుగుతోంది.

ఈ ట్రైలర్‌లో విజువల్ క్వాలిటీ ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. మొదటి భాగంలో విశ్వక్ సేన్‌కు సంబంధించిన ఫాల్ సీక్వెన్స్ ప్రేక్షకులకు గుర్తుండిపోయింది. ఇప్పుడు రెండో భాగంలోనూ అలాంటి ఓ సన్నివేశాన్ని దర్శకుడు తరుణ్ భాస్కర్ మరింత భారీగా, ఆధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందించినట్లు కనిపిస్తోంది. ట్రైలర్‌లోని కొన్ని దృశ్యాలు సినిమా నిర్మాణ విలువలను తెలియజేస్తున్నాయి. విశ్వక్ సేన్‌తో పాటు అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను, సాయిరామ్ తదితరులు తమ పాత్రల్లో మరోసారి సందడి చేయనున్నారు. శివాత్మిక రాజశేఖర్‌తో పాటు మరికొందరు నటులు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. స్నేహితుల మధ్య కెమిస్ట్రీ, కామెడీ టైమింగ్ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలిచే అవకాశముంది. మొదటి భాగానికి సంగీతంతో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన వివేక్ సాగర్ ఈ సీక్వెల్‌కు కూడా స్వరాలు అందిస్తున్నారు. ట్రైలర్‌లో ఆయన నేపథ్య సంగీతం సన్నివేశాలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొస్తోంది. కథలోని సరదా, ఉద్వేగం రెండింటినీ సంగీతం ద్వారా చక్కగా చూపించే ప్రయత్నం కనిపిస్తోంది. నవంబర్ 19న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.

‘బ్లడీ రోమియో’లో నాని లుక్ లీక్

న్యాచురల్ స్టార్ నాని, దర్శకుడు సుజీత్ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'బ్లడీ రోమియో'. తాజాగా ఈ చిత్ర బృందానికి ఊహించని తలనొప్పి ఎదురైంది. షూటింగ్ లొకేషన్ నుంచి ఏకంగా కీలక సన్నివేశాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలోకి లీక్ కావడంతో చిత్ర యూనిట్ ఒక్కసారిగా షాక్‌కు గురైంది. 'ది ప్యారడైజ్' తర్వాత నాని పూర్తి స్థాయిలో దృష్టి పెట్టిన ఈ భారీ ప్రాజెక్ట్ ప్రస్తుతం ఢిల్లీలో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. అయితే ఢిల్లీలోని రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాలలో చిత్రీకరణ జరుపుతుండటం టీమ్‌కు పెద్ద చిక్కులు తెచ్చిపెట్టింది.

ఢిల్లీ రోడ్లపై జరుగుతున్న షూటింగ్‌ను చూసేందుకు స్థానికులు భారీగా ఎగబడ్డారు. ఈ క్రమంలో పలువురు తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరణ దృశ్యాలను బంధించి, నేరుగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. క్షణాల్లోనే ఆ వీడియోలు వైరల్ కావడంతో నాని సినిమాలో ఎలా కనిపించబోతున్నారనే సరికొత్త లుక్ ముందే బయటపడిపోయింది. కేవలం లుక్ మాత్రమే కాకుండా, కథలో అత్యంత కీలకమైన కొన్ని సీన్లకు సంబంధించిన డిటైల్స్ కూడా లీక్ అయిన వీడియోలలో స్పష్టంగా కనిపిస్తుండటం మేకర్స్‌ను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కీలకమైన ఎపిసోడ్లు తెరకెక్కిస్తున్న తరుణంలో ఇలా లొకేషన్ విజువల్స్ బయటకు రావడం సినిమా హైప్‌పై, సస్పెన్స్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో రాబోయే షెడ్యూళ్లలో లొకేషన్ల వద్ద మరింత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, మొబైల్ ఫోన్లపై కఠిన ఆంక్షలు విధించాలని నిర్మాణ సంస్థ యోచిస్తోందట.

ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మాత వెంకట్ బోయనపల్లి అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందిస్తున్న ఈ యాక్షన్ డ్రామాను 2027 వేసవి కానుకగా గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఏదేమైనా, సినిమా షూటింగ్ మొదలైన తొలినాళ్లలోనే ఇలా వీడియోలు లీక్ అవ్వడం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.




ఓటమి శాశ్వతం కాదు

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య,జీతు మాధవన్ కాంబోలో తెరకెక్కిన లేటెస్ట్ సినిమా 'సీన్'. ఈ సినిమాలో సూర్య ఇన్‌బరాజ్ అనే పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తుండగా, నజ్రియా నజీమ్, నస్లెన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సూర్య, జీతు మాధవన్ కలసి పనిచేయడం ఇదే మొదటిసారి కావడం విశేషం. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ దీపావళి పండగ సందర్భంగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈనేపథ్యంలో.. ప్రమోషన్స్‌లో పాల్గొన్న సూర్య జీవితంలో కష్టపడటం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. జీవితాన్ని నమ్మాలని, ఏ ఓటమినీ శాశ్వతంగా భావించవద్దని అన్నారు. మనం ఏది కావాలని గట్టిగా కోరుకుంటామో అదే అవుతామని చెబుతుంటారు, కానీ కేవలం కోరుకోవడంతోనే సరిపోదని సూర్య అన్నారు.

దాన్ని సాధించడానికి నిజంగా కష్టపడాలని, కలలు నిజం కావాలంటే గట్టి ప్రయత్నం ఉండాలని ఆయన చెప్పారు. జీవితాన్ని గట్టిగా నమ్మాలని, అది చాలా అందమైనదని సూర్య తెలిపారు. మనుషులమైన మనకు ప్రాణం ఉన్నంతవరకు ప్రతి విషయాన్ని మార్చుకోవచ్చని, తప్పులను సరిదిద్దుకోవచ్చని చెప్పారు. శ్వాస ఉన్నంతవరకు ఏదీ ఓటమి కాదని, ఏదీ పూర్తిగా ముగిసిపోదని అన్నారు. ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా మళ్లీ కొత్తగా ప్రారంభించి అన్నీ సరిదిద్దుకోవచ్చని చెప్పారు. ఇక తన వయసు 50 ఏళ్లు దాటిన తర్వాత ఆలోచనల్లో మార్పు వచ్చిందని, ఇప్పుడు తనకు మనశ్శాంతి, మంచి ఆరోగ్యమే ముఖ్యమని సూర్య తెలిపారు.



'రూహ్'తో మ్యాజిక్ రిపీట్!



బాలీవుడ్ స్టార్ నటుడు ఇమ్రాన్ హష్మీ మళ్లీ తనకిష్టమైన హారర్ జోనర్‌లోకి అడుగుపెడుతున్నారు. 'రూహ్' అనే ప్రతిష్టాత్మక చిత్రంతో ఆయన ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్ లుక్‌తో పాటు విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈ హారర్ థ్రిల్లర్‌ను హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో 2027లో థియేటర్లలో భారీగా విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ఇక విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో చెట్టు ఊడల మధ్యలోంచి ఒక కన్ను తెరిచి చూస్తూ ఇమ్రాన్ హష్మీ భయంకరమైన లుక్‌లో కనిపించారు. ఈ సినిమా ప్రకటించిన సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ.. తన సినిమాల్లో పాటలు ఎప్పుడూ ప్రేక్షకులతో ఒక ప్రత్యేక బంధాన్ని ఏర్పరుస్తాయని, 'రూహ్' విషయంలో కూడా అదే మ్యాజిక్ రిపీట్ కాబోతోందని ఆనందం వ్యక్తం చేశారు.

కుమార్ తౌరానీతో మళ్లీ కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రంలో సంగీతం కేవలం పాటలకే పరిమితం కాకుండా, కథలోని ఆత్మను, గాఢమైన ప్రేమను, భయానక వాతావరణాన్ని ప్రతిబింబించేలా చేస్తుందని తెలిపారు. మయాంక్ శర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి విశాల్ కపూర్, మయాంక్ శర్మ కథనందించారు. హారర్, రొమాన్స్ కలయికలో మ్యూజికల్ ఫీస్ట్‌గా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. టిప్స్ ఫిలిమ్స్, టిప్స్ మ్యూజిక్ అధినేత కుమార్ తౌరానీతో కలిసి ఇమ్రాన్ హష్మీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇమ్రాన్ డెబ్యూ మూవీ 'ఫుట్‌పాత్' నుంచి తమ కాంబినేషన్‌లో ఎన్నో విజయాలు వచ్చాయని, ఇప్పుడు 'రూహ్'తో మరోసారి ఆ మ్యాజిక్ క్రియేట్ చేస్తామని కుమార్ తౌరానీ తెలిపారు.

ఈసారైనా హిట్ కొడతాడా?

కోలీవుడ్ దర్శకుడు విఘ్నేష్ శివన్ ఇటీవల 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రదీప్ రంగనాథన్, కృతి శెట్టి జంటగా నటించిన ఈ మూవీ బాక్సాఫీసు వద్ద భారీ డిజాస్టర్‌గా నిలిచింది. ఈ మూవీ తర్వాత కొంత విరామం తీసుకున్న విఘ్నేష్ శివన్.. ఇప్పుడు ఓ రొమాంటిక్ కామెడీ చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందులో భరత్, అరవింద్ స్వామి కీలక పాత్రల్లో నటించనున్నట్లు టాక్. ఇటీవల ఈ సినిమా కథ విన్న అరవింద్ స్వామికి అది బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో ఆయన గతంలో ఎన్నడూ చేయని ఒక విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారట. అంతేకాదు ఆయన ఈ చిత్రానికి పారితోషికం కాకుండా లాభాల్లో వాటా తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది.

దర్శకుడు విఘ్నేష్ శివన్ కూడా ఇదే లాభాల్లో వాటా తీసుకునే పద్ధతిలోనే ఈ చిత్రానికి పనిచేస్తుండటం గమనార్హం. 'ప్యాషన్ స్టూడియోస్, రౌడీ పిక్చర్స్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు కూడా ఎటువంటి హడావిడి లేకుండా సైలెంట్‌గా పూర్తయినట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో హీరోయిన్‌గా క్యూట్ బ్యూటీ నజ్రియను తీసుకోబోతున్నట్లు టాక్. ప్రస్తుతం దీనికి సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు ఈసారైనా విఘ్నేష్‌కు హిట్ దక్కుతుందా? లేక మళ్లీ డిజాస్టర్‌ను చవిచూస్తారా అని పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

